

ఉష్ణోగ్రత
గరిష్ఠం 39.8
కనిష్ఠం 18.5

19న అన్నాస్‌పల్లికి గవర్నర్

కడ్తాల్, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్మాస్‌పల్లిలోని ది ఎర్త్ సెంటర్‌లో ఈనెల 19న కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో యూత్ లీడర్స్ కాన్‌క్లేవ్ బెటర్ ఎర్త్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షురాలు లీలాలక్ష్మారెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని వివిధ కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొంటున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు.

వైభవం.. రథోత్సవం



ఎక్లాస్‌ఖాన్‌పేటలో రథాన్ని లాగుతున్న భక్తులు

కేశంపేట, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేటలో వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం శ్రీదేవి, భూదేవి, సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను రథంపై గ్రామ పురవీధుల గుండా ఆటపాటలు, కోలాటాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామివ్రతం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, కేశంపేట మాజీ ఎంపీపీ ఎల్లనమోని రవీందర్ యాదవ్, మురళీకృష్ణ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం చేస్తున్న భక్తులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

భూ భారతితో శాశ్వత పరిష్కారం

కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): 'భూ భారతి'తో భూ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనున్నట్లు కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. భూ భారతిపై మంగళవారం కలెక్టరేట్‌లో భూ భారతి, కొత్త రికార్డ్ ఆఫ్ రైట్స్(ఆర్వోఆర్) చట్టం అమలుపై సమీక్ష నిర్వహించారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు తీసుకొచ్చిన 'భూ భారతి'ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. జిల్లాలో వివాద రహిత భూ విధానాలు ఉండాలన్నదే ప్రభుత్వ ప్రయత్నమన్నారు. ఆధార్ తరహాలో భవిష్యత్‌లో భూమికి సంబంధించి సర్వే చేసి కొలతలు, హద్దుల వంటి సమగ్రమైన వివరాలతో 'భూధార్' తీసుకురాబోతున్నట్లు పేర్కొన్నారు. పైలట్ ప్రాజెక్టుగా భూ భారతిని జిల్లాలో చేపట్టడానికి ముందుగా ఎనిమిది నియోజకవర్గాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, డీఆర్వో సంగీత, ఆర్డీవోలు అనంతరెడ్డి, చంద్రకళ, జగదీశ్వర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

మే 5లోగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను ఫైనల్ చేయాలి

కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి ఇందిరమ్మ ఇళ్లు, తాగునీరు, రాజీవ్ యువ వికాసం, ఎల్‌ఆర్‌ఎస్, స్టిచ్చింగ్ ఆఫ్ స్కూల్ యూనిఫాంలపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి మే 5 వరకు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను ఫైనల్ చేయాలన్నారు. రాజీవ్ యువ వికాసం కింద వచ్చిన దరఖాస్తుల వెరిఫికేషన్‌ను 30వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో సాగునీరు, తాగునీరు, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని మిషన్ భగీరథ అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. నీటి లీకేజీలు, పైప్ లైన్ డ్యామేజీలు లేకుండా చూసుకోవాలన్నారు. నీటిని వృథా చేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలల విద్యార్థులకు సైజ్ తీసుకొని యూనిఫాం కుట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీలత, హౌజింగ్ పీడీ నాయక్, సీపీవో సౌమ్య, మిషన్ భగీరథ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగును

విస్తరించాలి

డైరెక్టరేట్ ఆఫ్ ఆయిల్ సీడ్స్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ పొన్నుస్వామి



మహేశ్వరం: మన్‌సాన్‌పల్లిలో ఆయిల్‌పామ్ పంటను పరిశీలిస్తున్న అధికారులు

మహేశ్వరం/షాద్‌నగర్‌రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆయిల్‌పామ్‌తోపాటు ఉద్యాన పంటల సాగు బాగుందని, ఈ విధానాన్ని దేశంలోని అన్ని రాష్ట్రాలకు విస్తరించాలని కేంద్ర ప్రభుత్వ ప్రతినిధుల బృందం అధికారి డైరెక్టరేట్ ఆఫ్ ఆయిల్ సీడ్స్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ పొన్నుస్వామి అన్నారు. మంగళవారం మండలంలోని గట్టుపల్లి, మన్‌సాన్‌పల్లి గ్రామాల్లో తెలంగాణ రాష్ట్ర ఉద్యాన శాఖ జాయింట్ డైరెక్టర్ సరోజినితో కలిసి పర్యటించారు. ఆయిల్ పామ్, ఉద్యాన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంటకు చట్టం ఉందని, మార్కెటింగ్ గురించి రైతులు దిగులు పడాల్సిన అవసరం లేదన్నారు. రంగారెడ్డి జిల్లాకు వాల్యూ ఆయిల్ అనే కంపనీతో ప్రభుత్వం ఒప్పదం చేసుకుందని తెలిపారు. జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు రాయితీలు ఇస్తుందని తెలిపారు. అనంతరం ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల శివారులో ఆయిల్ పామ్ పంటలను కేంద్ర బృందం సభ్యులు పరిశీలించారు. గ్రామానికి చెందిన వల్లు నర్సింహారెడ్డి 13.30 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నాడు. అంతరపంటగా బొప్పాయి వేయడంతో అధికారులు రైతును అభినందించారు. కార్యక్రమంలో అధికారులు సురేష్, కిషన్‌రావు, సౌమ్య, విజయకృష్ణ, రామ్‌మోహన్, ప్రమోద్, మల్లేష్, రైతులు హన్మంత్‌రెడ్డి, సామిరెడ్డి పాల్గొన్నారు.

నకిలీ నంబర్ ప్లేట్లకు అడ్డుకట్ట వేయడంతో పాటు వాహనాలు, రహదారి భద్రతే లక్ష్యంగా దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రవాణాశాఖ హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్లు(హెచ్‌ఎస్‌ఆర్‌పీ) తప్పనిసరి చేస్తూ నిర్ణయం తీసుకుంది. అన్నిరకాల వాహనాలకు ఇది వర్తిస్తుందంటూ గెజిట్ విడుదల చేసిన రవాణాశాఖ నంబర్ ప్లేట్ ధరలతో పాటు, గడువును కూడా ఖరారు చేసింది. ఈ నిబంధన వల్ల ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా వాహనాలకు నంబర్ ప్లేట్లు మార్చాల్సి ఉంది. దాదాపు అరకోటి వరకు పలురకాల వాహనాలు ఉండగా అందులో 30లక్షల వాహనాలకు నంబర్ ప్లేట్లు మార్చాల్సి ఉంటుందని అంచనా.



హైసెక్యూరిటీ తప్పనిసరి

ఉమ్మడి జిల్లాలో సుమారు అరకోటి వాహనాలు

30 లక్షల వాహనాలకు హైసెక్యూరిటీ నంబర్‌ప్లేట్లు అమర్చాల్సిందే!

కొత్త నిబంధనలను విధించిన ప్రభుత్వం

సకాలంలో అమర్చుకోకుంటే బీమా బంద్

ప్లేట్లకు ధరలు నిర్ణయించిన రవాణా శాఖ

సెప్టెంబరు 30వ తేదీ వరకే గడువు

నంబర్ ప్లేట్లకు చెల్లించాల్సిన రుసుము (రూ.లలో)	
టూ వీలర్	320-380
విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నవి	400-500
త్రీ వీలర్	350-450
కార్లు	590-700
విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నవి	700-860
వాణిజ్య వాహనాలు	600-800

ఉమ్మడి జిల్లాలో వాహనాలు	
రంగారెడ్డి	21,55,417
మేడ్చల్	22,53,337
వికారాబాద్	2,56,997



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి): అన్నిరకాల వాహనాలకు ఇక హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్లు (హెచ్‌ఎస్‌ఆర్‌పీ)తప్పనిసరిగా బిగించాలని ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్ల బిగింపునకు గడువుతో పాటు ధరలను కూడా రవాణా శాఖ నిర్దేశించింది. వాహన రకాన్ని బట్టి కనిష్ఠంగా రూ.320 నుంచి గరిష్ఠంగా రూ.860ల రుసుముగా నిర్ధారించింది. సెప్టెంబరు 30వ తేదీలోగా హైసెక్యూరిటీ ప్లేట్లను బిగించుకోకపోతే జరిమానాలు వేస్తారు. ఈ మేరకు గడువు తేదీ తరువాత హైసెక్యూరిటీ ప్లేట్ లేకుండా ఉన్న వాహనాలను రోడ్లపై తిరిగేందుకు అనుమతి ఇవ్వరాదని పోలీసు, రవాణాశాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. అలాంటి వాహనాలపై కేసులు నమోదు చేయాలని ఆదేశించింది.

విక్రయించడం కూడా సాధ్యపడదు

ఈ నిబంధనల వల్ల ఉమ్మడి జిల్లాలోనే అత్యధికంగా వాహనాలకు నంబర్ ప్లేట్లు మార్చాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో దాదాపు అరకోటి వరకు పలురకాల వాహనాలు ఉన్నాయి. ఇందులో 30లక్షల వాహనాలకు నంబర్‌ప్లేట్లు మార్చాల్సి ఉంటుందని అంచనా. ఇదిలా ఉంటే

మిగతా 7వ పేజీలో...

కలర్ కోడెడ్ స్టిక్కర్లతో..

ఈ హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్లలోని క్రోమియం హోలోగ్రామ్, లేజర్ ఆధారిత వివరాలను డూప్లికేట్ చేయడం దాదాపు అసాధ్యం. ఈ ప్లేట్లపై కలర్ కోడెడ్ స్టిక్కర్ల ద్వారా ఆ వాహనం పెట్రోల్, డీజిల్, ఎలక్ట్రికల్ లేదా ఏ ఇంధన రకానికి చెందుతుందో తెలుస్తుంది. పాత వాహనానికి కొత్తగా హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నంబరు ప్లేట్లను బిగించుకోవడానికి వాహన యజమానులు 'బుక్ మై హెచ్‌ఎస్‌ఆర్‌పీ' అనే వెబ్ సైట్‌లో వాహన వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. అనంతరం కొత్త నంబరు ప్లేట్ వచ్చాక దాన్ని వాహనానికి బిగించాక ఫొటో తీసి అదే వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలనే నిబంధన సైతం విధించారు.



ప్రగతి విరిసె.. పల్లె మురిసె

ఆదర్శం దేవునిబండ తండా!.. షాన్‌దార్ శామీర్‌పేట

అభివృద్ధిలో మెరిసిన కమ్మదనం, మేకవనంపల్లి

అభివృద్ధి సూచికల్లో ముందు వరుసలో గ్రామాలు

ఎంపిక చేసిన కేంద్ర పంచాయతీరాజ్ శాఖ

ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాలు అభివృద్ధిలో దూసుకెళ్తున్నాయి. 2023-24కు ప్రగతి ఆధారంగా కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ ప్రకటించిన అభివృద్ధి సూచికల జాబితాలో టాప్-5లో మేడ్చల్ జిల్లా శామీర్‌పేట, రంగారెడ్డి జిల్లా దేవునిబండ తండా, కమ్మదనం, వికారాబాద్ జిల్లా మేకవనంపల్లి గ్రామాలు చోటు దక్కించుకున్నాయి. ఆయా గ్రామాల్లో ప్రభుత్వం గుర్తించిన తొమ్మిది అంశాల అభివృద్ధిపై వివరిస్తూ ప్రత్యేక కథనాలు.

వివరాలు 7లో..

రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తున్న కేంద్రం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతిస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. మండల పరిధిలోని వైఎం తండా, పులిచర్లకుంటతండా, చింతగట్టుతండా, సిద్దాపూర్, ఎస్‌బీ పల్లి, కొడిచర్ల గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమానికి నియోజకవర్గ ఇన్‌చార్జి జైపాల్‌తో కలిసి హాజరయ్యారు. ఇంటింటికీ వెళ్లి భారత రాజ్యాంగం ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్‌ను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గజమాలలతో ఘనంగా సత్కరించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో రాజ్యాంగానికి పూర్తి స్వేచ్ఛ ఉంటుందని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్య పరుస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, మున్సిపాలిటీలు, మండల శాఖల అధ్యక్షులు సుదర్శన్‌గౌడ్, చెన్నయ్య, హరినాథ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నర్సింహా, వీరేశం, కృష్ణారెడ్డి, రాజు, నాయకులు ఎల్లారం శేఖర్‌రెడ్డి, అంబటి ప్రభాకర్, బాల్‌రెడ్డి, రఘు, బాబర్‌ఖాన్, అగ్గనూరి విశ్వం, రవికుమర్‌గుప్త, కృష్ణ, ఇబ్రహీం, బాల్‌రాజ్‌గౌడ్, రాంచందర్‌నాయక్, రవి నాయక్, మల్లారెడ్డి, సురేందర్, మల్లికార్జున్‌రెడ్డి, నవీన్ పాల్గొన్నారు.



ఎస్‌బీపల్లిలో పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే శంకర్, ఇన్‌చార్జి జైపాల్



సీఎల్పీ @ నోవాటెల్

రంగారెడ్డి జిల్లా, శంషాబాద్ ఎయిర్‌పోర్టు నోవాటెల్ హోటల్‌లో మంగళవారం సీఎల్పీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. భూ భారతి, ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం పంపిణీ, ఎస్సీ వర్గీకరణ అమలు.. తదితర సంక్షేమ పథకాలపై సమావేశంలో చర్చించారు. పై చిత్రంలో సీఎం రేవంత్‌రెడ్డి వెంట సమావేశానికి వస్తున్న పరిగి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

-శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి)

తాటిపర్తిలో భూసర్వే చేయొద్దు

- అధికారులను వేడుకున్న రైతులు

7

గాలివాన బీభత్సం



యాచారం: మంతన్‌గౌరెల్లిలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

- అయ్యవారిపల్లిలో తెగిపడిన విద్యుత్ తీగలు
- దేవునిపల్లిలో నేలమట్టమైన బొప్పాయి తోట
- మామిడి తోటల్లో రాలిన కాయలు, ఎగిరిపోయిన ఇంటి పైకప్పులు
- పిగుగుపాటుకు ఎద్దు, ఆవు మృతి

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఉదయం నుంచి ఎండ దంచి కొట్టగా మధ్యాహ్నానికి ఆకాశం చల్లబడింది. నిమిషాల్లోనే వాతావరణం మేఘావృతమైంది. పలు ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. షాద్‌నగర్ పరిధిలోని అయ్యవారి పల్లిలో ఈదురు గాలులతో కూడిన వర్షం బీభత్సానికి విద్యుత్ వైర్లు తెగి పడ్డాయి. ఘటనలో ఇద్దరు బాలురు గాయపడ్డారు. ఒకరి పరిస్థితి విషమంగా మారింది. అకాల వర్షానికి ఫరూక్‌నగర్ మండలం దేవునిపల్లిలో రైతు పాసుల పెద్ద జంగయ్యకు చెందిన నాలుగు ఎకరాల బొప్పాయి తోట గాలి దుమారానికి నేలమట్టమైంది. తీవ్ర నష్టం ఏర్పడింది. కాపుకొచ్చేసమయంలో నష్టం జరగడంతో రైతు కన్నీరుమున్నీరయ్యాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు. వికారాబాద్ మండలం బొంరాస్‌పేటలో చిరుజల్లులు కురిశాయి. రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో 14.0 మిల్లీమీటర్లు, తాళ్లపల్లిలో 13.0 మిల్లీమీటర్లు, కొందుర్గులో 9.3 మిల్లీమీటర్లు, చౌదరిగూడ మండలం కాసులబాద్‌లో 9.0 మిల్లీమీటర్లు, సరూర్‌నగర్ మండలంలో 7.8 మిల్లీమీటర్లు, షాబాద్‌లో 6.5 మిల్లీమీటర్లు, శేరిలింగంపలల్లిలో 6.3 మిల్లీమీటర్లు, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తాటివనంలో 6.3 మిల్లీమీటర్లు, వర్షపాతం నమోదైంది. మేడ్చల్ మల్కాజిగిరి మండలం ఘట్‌కేసర్‌లో 10.8 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదు కాగా వికారాబాద్ జిల్లా చౌడపూర్‌లో 6.5 మిల్లీమీటర్లు నమోదైంది.



మరిన్ని వివరాలు 8లో...

కొందుర్గు: లక్ష్మీదేవునిపల్లిలో నేలరాలిన మామిడికాయాలు

భద్రేశ్వరుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



నిత్యాన్నదానంలో భోజనాలు చేస్తున్న భక్తులు

తాండూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి):కోరికలు తీర్చే స్వామిగా పేరొందిన తాండూరు శ్రీ బావిగి భద్రేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం ఆలయంలో భద్రేశ్వరుడి మూల విరాట్‌ను అలకరించి పూజలు నిర్వహించారు. ఆలయ రెన్యోవేషన్ కమిటీ చైర్మన్ పటేల్ కిరణ్‌కుమార్, ఈవో శేఖర్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో ఉత్సవాలు ప్రారంభించారు. నిత్య అన్నదానానికి శ్రీకారంచుట్టారు. అన్నపూర్ణ మాత దాసోహ మందిరంలో తాండూరుకు చెందిన వైద్యులు డాక్టర్ వివేక్ షేరికార్ దంపతులు అన్నదానాన్ని ప్రారంభించారు. కమిటీ సభ్యులు వారిని సన్మానించారు. కార్యక్రమంలో మఠం నీలకంఠ స్వామి, ఆలయ కమిటీ సభ్యులు, కోటం సిద్ధిలింగం, కిరణ్‌కుమార్, గంగా శ్రావణ్, వీరశైవ సమాజం ప్రతినిధి జొన్నల బస్వరాజ్, భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న మోదీ ప్రభుత్వం



కందుకూరులో గ్రామస్తులు, నాయకులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న లక్ష్మారెడ్డి

కందుకూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు ప్రతీ ఒక్కరు కలిసిరావాలని.. పదకొండు సంవత్సరాల బీజేపీ ప్రభుత్వ హయాంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని అవహేళన చేసేందుకు మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కె.లక్ష్మారెడ్డి ఆరోపించారు. మంగళవారం పీసీసీ సభ్యులు, ఏనుగు జంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఎస్.కృష్ణానాయక్, మాజీ జడ్పీటీసీ జంగారెడ్డిలతో కలిసి కందుకూరులో నిర్వహించిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా చేపట్టిన భారత్‌జోడో యాత్ర ద్వారా ప్రజలను చైతన్యవంతం చేశారని గుర్తుచేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ విలువలను కాలగర్భంలో కలిపేసే ప్రయత్నం చేస్తోందన్నారు. జనవరిలో పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యాలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజ్యాంగ విలువలను గౌరవిసస్తూ. రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకుందని తెలిపారు. గ్రామంలో ర్యాలీగా వెళ్లి ప్రజలను చైతన్యం చేశారు. మహేందర్ ఇంట్లో భోజనం చేశారు. కార్యక్రమంలో నాయకులు బి.ప్రశాంత్ కుమార్, కె.విష్ణువర్ధన్‌రెడ్డి, యుగేంధర్‌గౌడ్, పుష్ప, పాండురంగారెడ్డి, మల్లేష్, సరికొండ పాండు, వెంకటేష్‌గౌడ్, భూపాల్‌రెడ్డి, కె.రాణా ప్రతాప్‌రెడ్డి, కవిత, సత్యనారాయణ, గణేష్, అఫ్జల్‌బేగ్, ప్రశాంతి, శేఖర్‌గౌడ్, సంజీవరెడ్డి, శేఖర్, పెద్ద ఐలయ్య, ప్రతాప్‌రెడ్డి, జి.సుధాకర్‌రెడ్డి, కుమార్, వినోద్‌చారి తదితరులు పాల్గొన్నారు.

పంటలు దెబ్బతిన్నా పట్టించుకోని సర్కార్



విలేకరులతో మాట్లాడుతున్న జైపాల్‌యాదవ్

ఆమనగల్లు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పంటలెండి, వడగండ్ల వర్షానికి పంటలు దెబ్బతిని రైతులు దుఖంలో ఉంటే ప్రభుత్వం పట్టించుకోకుండా గోస తీయిస్తుందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ ఆరోపించారు. హామిలను విస్మరించి ప్రజావిశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మహనీయుల పోటోలను అడ్డం పెట్టుకొని ఊరేగుతున్నారని ఆరోపించారు. ఆమనగల్లులో మంగళవా రం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ.. ఎండలు, విద్యుత్ కోతలు, వర్షాలకు పంటలు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.50వేలు చెల్లించాలన్నారు. లేకుంటే రైతులతో కలిసి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని జైపాల్ యాదవ్ హెచ్చరించారు. రైతులు సాగుచేసిన పంట ఏ విధంగా నష్టపోయినా పరిహారం అందిస్తామని కాంగ్రెస్ మెనిఫెస్టో, రైతు డిక్లరేషన్‌లో పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. రైతు భరోసా అమలులో ప్రభుత్వం విఫలమైందన్నారు. రూ.2లక్షల రుణమాఫీ సగం మంది రైతులకు కూడా చేయలేదని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక రైతులు వడ్ల అమ్మకాలకు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ ప్రభుత్వాన్ని కూల్చే ఆలోచన బీఆర్ఎస్‌కు లేదని, ఇప్పటికే కేసీఆర్ స్పష్టం చేసిన విషయాన్ని మాజీ ఎమ్మెల్యే గుర్తు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వం పల్లెల్లో అభివృద్ధిని అడ్డుకుంటోందని ఆరోపించారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల, మున్సిపల్ అధ్యక్షులు అర్జున్‌రావు, పత్యనాయక్, మాజీ జడ్పీటీసీలు అనురాధపత్యానాయక్, దశరథ్, నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్, గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, సయ్యద్ ఖలీల్, సైదులుగౌడ్, రమేశ్ నాయక్, వెంకటేశ్, ప్రసాద్ పాల్గొన్నారు.

పరిహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

తాండూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఇండ్రస్టియల్ పార్కులో భూములు కోల్పోయిన నిర్వాసితులు ప్రభుత్వం అందజేసే పరిహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ కోరారు. మంగళవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో హకీంపేటకు చెందిన నిర్వాసిత మహిళకు చెక్కును అందజేశారు. ఆయన మాట్లాడుతూ మొత్తం 33మంది రైతుల నుంచి 56ఎకరాల భూమిని ఇండ్రస్టియల్ పార్కుకు సేకరించామని తెలిపారు. ఎంపీఐపీ భూముల సేకరణ 50శాతం పూర్తయిందని వెల్లడించారు.



చెక్కు అందజేస్తున్న ఉమాశంకర్ ప్రసాద్

స్లాట్ బుకింగ్ విధానాన్ని రద్దుచేయాలి

ఘట్‌కేసర్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్లాట్ బుకింగ్ విధానాన్ని రద్దుచేయాలని డిమండ్ చేస్తూ మంగళవారం ఘట్‌కేసర్, నారపల్లిలోని డ్యాకుమెంట్ రైటర్లు ఆందోళన నిర్వహించారు. తెలంగాణ డ్యాకుమెంట్ రైటర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు దుకాణాలను మూసివేసి బంద్ పాటించారు. ఘట్‌కేసర్ సబ్‌రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. ఫెడరేషన్ నాయకులు మాట్లాడుతూ.. స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్ పద్ధతితో అమ్మకం, కొనుగోలుదారులు ఇబ్బందులు పడే అవకాశముందన్నారు. ఆన్‌లైన్‌లో పొరపాట్లను సవరించుకోవడానికి ఎడిట్ ఆప్షన్‌ను ఇవ్వలేదన్నారు. ఎంతో కాలంగా డ్యాకుమెంట్లను తాయారు చేస్తూ జీవనం సాగిస్తున్న అనేక మంది ఉపాధి కోల్పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. వెంటనే ప్రభుత్వం పాతపద్ధతిలోనే రిజిస్ట్రేషన్లు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీకాంత్, సుధాకర్, కృష్ణకుమార్, లక్ష్మణచారి, మహేష్, అనిల్, నరేష్, యునిష్, శ్రావణ్, శివారెడ్డి పాల్గొన్నారు.



సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న డ్యాక్యుమెంట్ రైటర్లు

హెచ్‌సీయూ భూములపై మాట్లాడే అర్హత మోదీకి లేదు



మాట్లాడుతూన్న గౌరి సతీష్

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): హెచ్‌సీయూ భూముల గురించి మాట్లాడే అర్హత ప్రధాని మోదీకి లేదని పీసీసీ అధికార ప్రతినిధి గౌరిసతీష్ అన్నారు. అడవులపైకి బుల్డోజర్లను పంపడంలో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం బిజీగా ఉందంటూ హరియాణా లో సోమవారం మోదీ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లో మాట్లాడుతూ.. 2004 ఎన్డీఏ సంకీర్ణ ప్రభుత్వం ఉన్నప్పుడు లేవనెత్తని అంశాన్ని ఇప్పుడు మాట్లాడడం దేనికి నిదర్శనమని ప్రశ్నించారు. తెలంగాణలో విద్వేశాలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రకృతి పర్యావరణాన్ని కాపాడేందుకు జూపార్కులను కాంగ్రెస్ ప్రభుత్వాలే ఏర్పాటు చేశాయన్నారు. రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మోదీకి కన్పించకపోవడం విచారకరం అన్నారు. హెచ్‌సీయూ భూముల విషయంలో ఆయన వాస్తవాలు తెలుసుకోవాలన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో చెట్ల నరికివేత, పర్యావరణ కాలుష్యం ఆయనకు కన్పించడం లేదా? అని ఆయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చి అమలు చేస్తుంటే ఓర్వలేక ఇలాంటి వ్యాఖ్యలు సబబు కాదని సతీష్ విమర్శించారు.

పట్టణాల్లోనూ ఉపాధి పనులు చేపట్టాలి



మాట్లాడుతున్న కాంతయ్య

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పట్టణాల్లోనూ ఉపాధి పనులు చేపట్టాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం(బీకేఎంయూ) రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మొయినాబాద్ పరిధిలో నిర్వహించిన జిల్లా సమావేశానికి హాజరై మాట్లాడారు. గ్రామీణ పేదలకు ఉపాధికి ఒక చట్టం కావాలని అప్పటి యూపీఏ ప్రభుత్వాన్ని కోరితే 2005లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తెచ్చారన్నారు. ప్రస్తుత మోదీ ప్రభుత్వం ఉపాధి హామీకి నిధులు తగ్గించి చట్టాన్ని నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. ఈ పథకానికి ప్రతి సంవత్సరం రూ.2.86లక్షల కోట్లు అవసరం ఉంటే రూ.86కోట్లు మాత్రమే కేటాయించి పథకాన్ని సక్రమంగా అమలు చేయకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా ఉపాధి హామీకి అధిక ని ధులు కేటాయించి 200 రోజులు పని కల్పిస్తూ రోజుకు వేతనం రూ.700 వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అంజయ్య, జంగయ్య, సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, లక్ష్మయ్య, కృష్ణ, స్వరూప, యశోధ, నరసింహ, మల్లేష్, రాములు, సత్తిరెడ్డి, శ్యాం ఉన్నారు.

గిన్నిస్ బుక్ రికార్డ్సులో దోమ వాసికి చోటు

దోమ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): దోమకు చెందిన రాములు నాన్‌స్టాప్‌గా కీబోర్డు వాయించి గిన్నిస్ బుక్ రికార్డ్సులో స్థానం సంపాదించాడు. హైదరాబాద్‌లోని మణికొండలో గిన్నిస్ సంస్థ ప్రతినిధి ఆగస్టీన్ వేణుగోపాల్ చేతుల మీదుగా మంగళవారం అయన సర్టిఫికెట్‌ను అందుకున్నారు. అంతర్జాతీయ మ్యూజిక్ స్కూల్ మేనేజ్‌మెంట్ కీబోర్డు ఈవెంట్‌లో గిన్నిస్ రికార్డుకు 8 దేశాల నుంచి ప్రతినిధులను ఆహ్వానించింది. మొత్తం వేయి నలభై ఆరు మంది పేర్లు నమోదు చేసుకోగా ఏడాది పాటు ఆన్‌లైన్ కీబోర్డు ప్లేయింగ్‌లో శిక్షణ ఇచ్చింది. 2024 డిసెంబరు 1న 1,046 మందితో ఒకే సమయంలో గంటపాటు ఆన్‌లైన్‌లో నాన్‌స్టాప్‌గా కీబోర్డుపై ఈవెంట్‌ను హలేల్ సంగీత పాఠశాల నిర్వహించింది. గిన్నిస్‌బుక్‌లో స్థానం కోసం కార్యక్రమం నిర్వహించారు. దీంతో ఈ బృందంలోని రాములుని గిన్నిస్‌బుక్ ఆఫ్‌రికార్డ్స్ ప్రతినిధులు సర్టిఫికెట్ అందజేశారు.




సర్టిఫికెట్ అందుకుంటున్న రాములు

ప్రగతి విరిసె.. పల్లె మురిసె

పల్లెకు పట్టం 4

ఆదర్శ పంచాయతీగా దేవునిబండ తండా!



షాద్‌నగర్/షాద్‌నగర్ రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు అభివృద్ధికి ఆమడదూరంలో తండాలు నేడు ప్రగతి పథంలో పయనిస్తున్నాయి. పంచాయతీలుగా మారిన తండాలు అభివృద్ధిలో తాము సైతం అంటూ ఇతర గ్రామాలతో పోటీపడుతున్నాయి. కొత్తగా పంచాయతీ అయిన తండాలు ఐదున్నరేళ్లలోనే కేంద్ర పంచాయతీరాజ్ శాఖ ప్రశంసలు అందుకోవడం గమనార్హం. కేంద్ర పంచాయతీరాజ్ శాఖ విడుదల ఆదర్శ పంచాయతీల్లో ఫరూఖ్‌నగర్ మండలం దేవునిబండ తండా 76.55శాతం స్కోర్‌తో ఉత్తమ గ్రామంగా ఎంపికైంది. 2019లో తండా పంచాయతీగా ఏర్పాటైంది. ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధికి మళ్లించారు. 1,300 జనాభా ఉన్న తండాలో సీసీ రోడ్లు, పచ్చదనం, ప్రాథమికోన్నత పాఠశాల, మహిళా ఉన్నాయి. 20 మహిళా సంఘాల్లో 222 మంది సభ్యులున్నారు. వీరు రూ.1.64కోట్ల బ్యాంక్ రుణం పొంది కొంత ఆర్థిక వృద్ధి సాధించారు. వాటర్‌ను ట్యాంక్‌లతో ఇంటింటికి నీటి సరఫ రా చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో 30 మంది చి న్నారులకు రోజూ పౌష్టిహారం అందిస్తున్నారు. ఎకరంలో పల్లె ప్రకృతి వనంలో 500పైగా మొక్కలను పెంచుతున్నారు. ఆధునిక పద్ధతులతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకున్నారు.

ఇటీవల కేంద్ర పంచాయతీరాజ్ శాఖ దేశ వ్యాప్తంగా గ్రామాలకు గ్రేడింగ్ ఇచ్చి ఆదర్శ గ్రామాలను ఎంపిక చేసింది. పంచాయతీల్లో జరిగిన అభివృద్ధి, గ్రామాల్లో ప్రజలకు కల్పిస్తున్న సదుపాయాలు, ప్రభుత్వ నిధుల సద్వినియోగం, పారిశుధ్య నిర్వహణ, స్వచ్ఛత, స్కూళ్లు, అంగన్‌వాడీల సేవలు, మహిళలకు అవకాశాలు తదితర 9అంశాలపై స్కోరింగ్ ఇచ్చి ఉత్తమ పంచాయతీలను ఎంపిక చేశారు. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలోని ఫరూఖ్‌నగర్ మండలం దేవునిబండ తండా, కమ్మదనం, శామీర్‌పేట, మేకవనంపల్లి గ్రామాలు ఉత్తమ స్కోర్‌తో ముందంజలో నిలిచాయి.

గర్వంగా ఉంది



మా పంచాయతీ అభివృద్ధితో ఆదర్శంగా నిలవడం గర్వంగా ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు సహకరించడం వల్లే గ్రామాన్ని అభివృద్ధి చేసుకున్నాం. ఆదర్శ పంచాయతీగా ఎదిన విషయాన్ని అధికారులు గుర్తించి తండా పంచాయతీలకు మరిన్ని నిధులు సమకూర్చాలి. సమష్టిగా కృషిచేస్తే ఫలితాలు వస్తాయని అందరూ గుర్తించాలి. తండావాసుల సహకారం మరువలేనిది.

- మధులతమోహన్, మాజీ సర్పంచ్- దేవునిబండతాండ,

శామీర్‌పేట, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా శామీర్‌పేట పంచాయతీ అభివృద్ధిలో ఆదర్శంగా నిలిచింది. పంచాయతీలో 2,300ఇండ్లు, 10,500 జనాభా, 7వేలకుపైగా ఓటర్లు, 12-వార్డులున్నాయి. తాజా మాజీ సర్పంచ్ బాలమణి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి ఎంపీపీ, ఇతర ప్రజాప్రతినిధులు, కార్యదర్శి, సిబ్బంది, జిల్లా, అధికారుల సహకారాలతో రూ.10కోట్ల నిధులతో గ్రామంలో వివిధ పనులు చేశారు. ప్రజా సౌకర్యాలకు ప్రాధాన్యం ఇచ్చారు. రూ.4కోట్లతో అన్ని వార్డుల్లో సీసీరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థలను ఏర్పాటు చేశారు. రూ.1కోటి వెచ్చించి నాలుగు వైకుంఠదామాల్లో హైమాక్స్ లైట్లు, నీటి సౌకర్యం, ప్రహరీ సౌకర్యాలు కల్పించారు. చెత్త డంప్ యార్డును ఏర్పాటు చేశారు. కోటి నిధులతో అన్ని వీధుల్లో, మెయిన్ రోడ్డులో లైట్లను ఏర్పాటు చేశారు. పాఠశాలలు, అంగన్‌వాడీల్లో ఉత్తమ సౌకర్యాలను కల్పించారు. రెండు కమ్యూనిటీ హాళ్లకు స్థలాలు సేకరించారు. 119 స్వయం సహాయక సంఘా మహిళలు బ్యాంకులతో రుణాలు పొంది ఆర్థిక ఇబ్బందులు తీర్చుకున్నారు. కొందరు చిరు వ్యాపారాలు పెట్టుకున్నారు. ఎంపీడీవో మమతాబాయి, వీఓఏలు, గ్రామ పంచాయతీ కార్యదర్శి మౌనిక మహిళల అభివృద్ధికి పాటుపడుతూ చేయూతనిచ్చారు.



శామీర్‌పేటలోని చౌరస్తాను వెడల్పు చేసి వేసిన సీసీ రోడ్డు

బస్ షెల్టర్‌తో తీరిన ఇబ్బందులు

గ్రామం మీదుగా వెళ్తున్న రాజీవ్ రహదారి పక్కన బస్సుషెల్టర్‌ను ఏర్పాటు ప్రయాణికుల ఇక్కట్లు తీర్చారు. రాజీవ్ రహదారిహైవే నుంచి శామీర్‌పేట పాతగ్రామం ఎంట్రీలో ఉన్న పెద్ద చౌరస్తాను వెడల్పు చేసి సీసీ రోడ్డు వేశారు. గ్రామంలో ఎక్కడ చూసినా పచ్చదనం దర్శనమిస్తోంది. మాజీ సర్పంచ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున హరితహారాన్ని నిర్వహించి మొక్కలను నాటారు. అన్ని కాలాల్లో వాటిని సంరక్షించి హరితవనంలా తీర్చిదిద్దారు.

సమష్టి కృషితోనే ఫలితాలు



మాజీ మంత్రి మల్లారెడ్డి, వార్డు సభ్యుల, అధికారుల సహకారంతో శామీర్‌పేట పంచాయతీలో అభివృద్ధి సాధించాం. తన సర్పంచ్ పదవికాలంలో 2019-2024లో అభివృద్ధి పనులకు రూ.10కోట్ల వరకు వెచ్చించాం. ప్రజలకు మౌలిక సౌకర్యాలను కల్పించాం. పల్లెప్రగతి పనుల్లో ఆదర్శంగా నిలిచాం. హైవే పై ఉన్న గ్రామంలో పట్టణాలకు దీటుగా వసతులు అందుబాటులోకి తెచ్చాం. మమ్మల్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించినందుకు కృతజ్ఞతలు.

- వి.బాలమణి, మాజీ సర్పంచ్, శామీర్‌పేట

షాన్‌దార్ శామీర్‌పేట్!

2022లోనూ అవార్డు

శామీర్‌పేటలో ఉత్తమ పనులకు, గ్రామంలో అత్యధికంగా మొక్కలను నాటి హరితవనాలుగా తీర్చిదిద్దినందుకు రాష్ట్ర ప్రభుత్వం అవార్డు ఇచ్చింది. 2022లో కలెక్టర్ ఎంపీరెడ్డి అప్పటి సర్పంచ్ బాలమణికి జిల్లా స్థాయిలో ఉత్తమ పంచాయతీ అవార్డును ప్రదానం చేశారు.

ప్రణాళిక ప్రకారం పనులు..



శామీర్‌పేట పల్లె ప్రగతికి, అభివృద్ధి కార్యక్రమాల ప్రతిపాదనలు, అందుకు తగ్గ ప్రణాళికతో పనులు చేశాం. తాము చేసిన ప్రజోపయోగ పనులను గుర్తించి కేంద్ర ప్రభుత్వం గుర్తించి శామీర్‌పేటను ఆదర్శ పంచాయతీగా గుర్తించడం మాకు సంతోషాన్నిస్తోంది. ఇది అందరికీ ప్రోత్సాహకర పరిణామం. ఈ స్ఫూర్తితో మండల పరిధి అన్ని గ్రామాలు అభివృద్ధికి పాటుపడుతాయి.

- మమతాబాయి, ఎంపీడీవో, శామీర్‌పేట

ప్రభుత్వ ఆదేశాల మేరకు పనిచేశాం

ప్రభుత్వ, కలెక్టర్ ఆదేశాలను పాటిస్తూ విధులను బాధ్యతగా నిర్వహించాం. శామీర్‌పేటలో ఎప్పటికప్పుడు ప్రజాసమస్యలు పరిష్కరించాం. చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో, సక్రమంగా పూర్తిచేయడంలో బాధ్యతగా పనిచేశాం. అభివృద్ధి పనులను కేంద్రం గుర్తించి ఆదర్శ గ్రామంగా ప్రకటించడం సంతోషకరం.

- మౌనిక, పంచాయతీ కార్యదర్శి, శామీర్‌పేట

అభివృద్ధిలో దూసుకుపోతున్న మేకవనంపల్లి



మేకవనంపల్లిలో సీసీ రోడ్డు

మోమిన్‌పేట్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేకవనంపల్లి అభివృద్ధిలో దూసుకుపోతోంది. ప్రభుత్వ సహకారం, సమష్టి కృషితో స్థిరాభివృద్ధి సాధించిందని కేంద్రం వెల్లడించింది. పురోగతి సూచికలో గ్రామం ఐదో స్థానంలో నిలిచింది. 76.82శాతం పీడీఐ స్కోర్ సాధించింది. మేకవనంపల్లి ముంబాయి హైవేకు 6కిలో మీటర్ల దూరంలో ఉండటంతో అక్కడ డబుల్ బీటీ రోడ్డు, పరిశ్రమలు, పెట్రోల్ బంక్, వెంచర్లు, ఫాంహౌస్‌లు, ఫంక్షన్ హాళ్లు ఉండటంతో దినదినా అభివృద్ధిలో దూసుకువెళ్తోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం పురుష లు 1061, మహిళలు 998 మంది ఉన్నారు. ఓటర్లు 2062 మంది. గ్రామకంఠం 10ఎకరాలు, రెవెన్యూ విస్తీర్ణం 1,494.08 ఎకరాలు ఉన్నాయి. గ్రామంలో 54 మహిళా సంఘాల్లో 540 మం ది సభ్యులు ఉన్నారు.వారు బ్యాంకు రుణాలతో వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. జిల్లా పరిషత్ పాఠశాలలో 334 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఉన్నాయి. గ్రామంలో 262 మంది సంక్షేమ పింఛన్లు పొందుతున్నారు. 535 మందికి ఉపాధి హామీ జాబ్ కార్డులు, 510 మందికి రేషన్ కార్డులు ఉన్నాయి. ఖాళీ స్థలాలు, పొలాల గట్లపై మొక్కలు పెంచుతున్నారు. పల్లె ప్రకృతి వనంలో వెయ్యికిపైగా మొక్కలు నాటారు. రోజూ రోడ్లు, మురుగు కాలువలు శుభ్రం చేస్తారు. తడి, పొడి చెత్తను డంప్ యార్డుకు తరలిస్తారు. గ్రామంలో ఇంటింటికి నల్లా కనెక్షన్లు ఇచ్చారు. అంతర్గత రోడ్లు, మురుగు కాల్వల నిర్మించారు. కల్వర్టులు, నూతన ట్యాంకు, పశువైద్యశాల నిర్మాణాలు చేపడుతున్నారు. రైతు వేదిక, సొసైటీ కార్యాలయం ఉన్నాయి. సాగుభూములుండటంతో పేదరికం లేదు. ఉద్యోగుల సంఖ్యా ఎక్కువే ఉంది.

సుపరిపాలన అందిస్తున్నాం



గ్రామాభివృద్ధికి పాటుపడుతూ ప్రజలకు సుపరిపాలన అందించాం. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లిస్తూ సహకరించాలి. గ్రామాభివృద్ధికి తొమ్మిది అంశాల వివరాలను పీఆర్ పోర్టల్‌లో నమోదు చేశాం. ఆరోగ్యం, విద్య, పరిశుభ్రతకు కృషిచేస్తున్నాం. సీసీ రోడ్లు, డ్రెయిన్లు, పశువైద్యశాల, ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ, ట్యాంకులను కొత్తగా నిర్మించాం.

- సుగుణ, పంచాయతీ కార్యదర్శి మేకవనంపల్లి

ఉత్తమ సేవలకు గుర్తింపు



షాద్‌నగర్/షాద్‌నగర్ రూరల్ (ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధే లక్ష్యంగా.. చిన్న, పెద్ద తేడాలేకుండా గ్రామస్తులంతా ఒక్కటైతే సమస్యలను మట్టుపెట్టి ప్రగతికి పట్టుబడతారు. పల్లెలను అభివృద్ధి పథంలో నిలుపుతారు. దీన్ని నిరూపించారు ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం వాసులు. గ్రామ జనాభా 3వేలకుపైగా ఉంది. గ్రామ కంఠం 28ఎకరాలు, రెవెన్యూ విస్తీర్ణం 2,100ఎకరాలుంది. 32మహిళా సంఘాల్లో 345 మంది సభ్యులున్నారు. 12 సంఘాల మహిళలు బ్యాంకుల నుంచి రూ.1.64కోట్ల రుణాలు తీసుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. వారు ఉపాధి పొందుతూ మరో 100మందికి ఉపాధి కల్పిస్తున్నారు. గ్రామంలో ఐదెకరాల్లో ఉన్న పల్లె ప్రకృతివనంలో 5వేల మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచారు. దాంతో పాటు అర్బన్ ఫారెస్టు పార్క్ ఏర్పాటుతో ఆహ్లాదాన్ని కల్పిస్తున్నారు. గ్రామంలో ఉన్న రెండు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 150 శిశువులు, చిన్నారులు, గర్భిణులకు పౌష్టికహారం అందిస్తున్నారు. తాగు నీటికి ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్లు ఇచ్చారు. గ్రామంలో 80శాతం మంది వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.



గ్రామంలో సీసీ రోడ్డు

గ్రామస్తులు, అధికారుల కృషితోనే సాధ్యం



కమ్మదనం ఉత్తమ పంచాయతీగా ఎంపికవడం హర్షణీయం. అధికారులు, గ్రామస్తుల కృషితోనే ఇది సాధ్యమైంది. ఒకప్పుడు కమ్మదనం అంటే అటవీ ప్రాంతంగా గుర్తింపుండేది. మా గ్రామం కింద 5వేల ఎకరాల అటవీ భూమి ఉంది. గ్రామంలో అంతర్గత రోడ్లు, తాగు నీటి సౌకర్యం కల్పించాం. పాఠశాలలను ఏర్పాటు చేశాం. ప్రభుత్వ నిధులతో గ్రామాన్ని అభివృద్ధి చేశాం.

- నర్సింహులు, మాజీ సర్పంచ్, కమ్మదనం

రైతు సంక్షేమంలో అగ్రభాగాన తెలంగాణ



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

తలకొండపల్లి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పథకాలు, అందిస్తున్న తోడ్పాటుతో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. రైతు సంక్షేమ కార్యక్రమాల అమల్లో తెలంగాణ ప్రభుత్వం దేశంలో ఆదర్శంగా నిలిచిందన్నారు. పడకల్‌లో ఏర్పాటు చేసిన పొద్దుతిరుగుడు, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గీతనర్సింహ, ప్యాక్స్ చైర్మన్ కేశవరెడ్డి లతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. రైతులకు సబ్సిడీ రోటోవేటర్లను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీ, రైతుభరోసా, సన్న వడ్లకు బోనస్, పంట ఉత్పత్తులకు మద్దతు ధర వంటివి అమలు చేస్తోందన్నారు. నాణ్యమైన ఉత్పత్తులతో మద్దతు ధర, అంతర్జాతీయ మార్కెట్‌లో రైతులు పోటీపడాలని సూచించారు. రైతులను రాజులను చేయాలని, అప్పు తీసుకునే స్థాయి నుంచి అప్పులిచ్చే స్థాయికి ఎదగాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి ధ్యేయమన్నారు. నేల స్వభావాన్ని బట్టి పంటలను సాగు చేయాలని, రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువులతో ఆహార ఉత్పత్తులను మార్కెటింగ్ చేయాలన్నారు. ఆయిల్ పామ్, ఆరుతడి పంటలపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ప్యాక్స్ సీఈవో ప్రతాప్‌రెడ్డి, డైరెక్టర్లు డాక్టర్ శ్రీను, దేవ్లా, యాదయ్య, మిట్టపల్లి అంజయ్య, అజీం, శ్యామ్‌సుందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఏడీఏ శోభారాణి, ఏవో రేణుకచక్రవర్తి, నాయకులు మోహన్‌రెడ్డి, డేవిడ్, దశరథం, రంగారెడ్డి, రమాదేవి, శ్రీశైలం, ఆరిఫ్, రవీందర్, జగ్గారెడ్డి, యాదయ్య, కృష్ణ పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసిన వారికే ఎన్నికల్లో అవకాశం

పార్టీ కోసం కష్టపడ్డ నాయకులకే నామినేటెడ్ పదవుల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్ అవకాశాలు ఉంటాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో పార్టీ శ్రేణులు అంతా పాల్గొనాలని కోరారు. తలకొండపల్లి మండలం వెంకటాపూర్ తండా,పెద్దూర్ తండా, దేవుని పడకల్, లింగరావుపల్లి గ్రామాల్లో మంగళవారం జై బాపు... జై భీమ్... జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ జెండాలను ఆవిష్కరించి రాజ్యాంగ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. ఇంటింటికి ప్రభుత్వ పథకాలను వివరించారు. నాయకులు మిట్టపల్లి అంజయ్య, అజీం, జగ్‌పాల్‌రెడ్డి, దశరథం, శ్రీను, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై బీజేపీ కుట్రలను ఎండగట్టాలి

కడ్తాల్: రాజ్యాంగాన్ని కాలరాసే కేంద్రంలోని బీజేపీ కుట్రలను ప్రజలంతా ఎండగట్టాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పిలుపు నిచ్చారు. కడ్తాల మండలం గాన్గుమర్ల తండా, పోచమ్మ గడ్డ తండా, కానుగుబావి తండాల్లో జై సంవిధాన్‌లో భాగంగా పాదయాత్ర నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిచ్యానాయక్, యాట నర్సింహ్మా ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే, డీసీసీ ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్‌లతో కలిసి ఇల్లిల్లు తిరిగి రాజ్యాంగ పరిరక్షణ, గాంధీజీ, అంబేడ్కర్ ఆశయాలు, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లోక్‌సభలో అంబేడ్కర్‌ను, రాజ్యాంగాన్ని అవమానించేలా మాట్లాడిన కేంద్రమంత్రి అమిత్‌షా ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. గిరిజనుల సంక్షేమం, తండాల అభివృద్ధికి కాంగ్రెస్ పెద్దపీట వేస్తుందన్నారు. లంబాడాలను ఎస్టీల్లో కలిపిన ఘనత కాంగ్రెస్ ప్రధాని ఇందిరాగాంధీకే దక్కిందన్నారు. రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ, బీసీ బిల్లు ఆమోదం, భూ భారతి చట్టం, సన్నబియ్యం పంపిణీ వంటి సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారని తెలిపారు. నాయకులు వెంకటేశ్, లక్పతి, నరేశ్, రాజు, జవహర్‌లాల్, హీరాసింగ్, మోత్య, పత్య, రాజేశ్, రవి పాల్గొన్నారు.

ఊటుపల్లిలో తాగునీటికి ఇబ్బందులు



ఎడ్లబండిపై నీరు తెచ్చుకుంటున్న గ్రామస్తులు

దోమ, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): ఊటుపల్లి ఒకటో వార్డులో తాగునీటి సమస్యతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ నీరు సరిగ్గా రావడం లేదని చెబుతున్నారు. సింగిల్ ఫేజ్ మోటార్ నడవక 20రోజుల నుంచి అవస్థలు పడుతున్నామని వాపోయారు. తాగునీటిని తెచ్చుకునేందుకు ఎండ్ల బండ్లు, ట్రాక్టర్లతో పొలాలకు వెళ్తున్నామని చెప్పారు. ఉన్నతాధికారులు స్పందించి కాలనీలో తాగునీటి సమస్య తీర్చాలని కోరుతున్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కృషి



ఎస్‌టీపీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. శంషాబాద్ మున్సిపాలిటీ కొత్వాల్‌గూడ-హిమాయత్‌సాగర్ ప్రాంతంలో నిర్మించే సీవరేజ్ ట్రీట్‌మెంటు ప్లాంట్(ఎస్‌టీపీ) నిర్మాణానికి మంగళవారం శంఖుస్థాపన చేశారు. జంట నగరాలకు తాగునీరందించే హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జలాశయాలు కలుషితం కాకుం డా ట్రీట్‌మెంట్ ప్లాంట్లు నిర్మిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ మాజీ కార్యవర్గం సుష్మామహేందర్‌రెడ్డి, బండిగోపాల్‌యాదవ్, మేకలవెంకటేష్, శ్రీనివాస్‌గౌడ్, మురళీకృష్ణ,మాజీ సర్పంచ్ ఆర్. గణేష్‌గుప్తా మున్సిపల్ కమీషనర్ సుమన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తై బజార్ వేలం రద్దు!

● కమిషనర్‌పై ఎమ్మెల్యే ఆగ్రహం ● వ్యాపారుల వ్యతిరేకత



వ్యాపారం చేస్తున్న చిరు వ్యాపారులు

తాండూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 4న తాండూరు మున్సిపాలిటీలో నిర్వహించిన తై బజార్ వేలం రద్దుకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ విక్రం సింహారెడ్డిపై ఈ వ్యవహారంపై ఎమ్మెల్యే సీరియెసయ్యారు. చిరు వ్యాపారులపై తై బజార్ పేరిట భారం మోపడం ఏమిటని మందలించినట్లు సమాచారం. తై బజార్‌ను రద్దు చేయాలని ఆదేశించారు. తై బజార్ వేలంలో కాంట్రాక్టర్ మోజం రూ.10.21లక్షలకు దక్కించుకున్నాడు. దీంతో మోజం తోపుడుబండ్లు, కూరగాయల, చిరు వ్యాపారుల వద్ద తై బజార్ వసూలు ప్రారంభించారు. దీంతో వారి నుంచి వ్యతిరేకత మొదలైంది. కాంగ్రెస్ పార్టీ నాయకులు, వ్యాపారులు, రైతులు ఎమ్మెల్యే వద్దకు వెళ్లి తై బజార్ పేరిట రోజూ డబ్బు వసూలు చేస్తే తామెలా బతకాలని వాపోయారు. దీంతో ఎమ్మెల్యే తై బజార్‌ను రద్దు చేయాలని కమిషనర్‌ను ఆదేశించారు. వ్యాపారులు, రైతులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నందునే తై బజార్‌ను రద్దుచేశామని ఆంధ్రజ్యోతికి ఎమ్మెల్యే చెప్పారు.

‘హైసెక్యూరిటీ’ తప్పనిసరి


(5వ పేజీ తరువాయి)

ఇక మీదట పాత వాటి స్థానంలో హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లను వాహనదారులు అమర్చుకోకుంటే వాటిని విక్రయించడం కూడా సాధ్యపడదు. అలాగే బీమా, రిజిస్ట్రేషన్ పొల్యూషన్ ధ్రువపత్రం, తదితర సేవలన్నీ నిలిపివేస్తారు. గతంలో 2019 మార్చి 31 తర్వాత కొన్న వాటికి మాత్రమే ఈ నిబంధన పెట్టారు. అయితే ఇపుడు కొత్త వాహనాలతో పాటు 2019 మార్చి 31 కంటే ముందు కొనుగోలు చేసిన వాటికి సైతం ఇకపై హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నెంబర్ ప్లేట్లను అమర్చుకోవాల్సిందే.

చెల్లింపులు ఇలా...

వెబ్‌సైట్‌లోకి వెళ్లి వివరాలు పూర్తి చేసిన తర్వాత హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్ కోసం నిర్దేశించిన రుసుం జనరేట్ అవుతుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనే క్రెడిట్/డెబిట్/యూపీఐ/నెట్ బ్యాంకింగ్ ఆప్షన్ల ద్వారా చెల్లింపులు చేయొచ్చు. డబ్బులు చెల్లించిన తరువాత వివరాలు చెక్ చేసుకుని పేమెంట్ స్లిప్ ప్రింట్ తీసుకోవాలి. ఈ స్లిప్ వ్యాలిడిటీ 28రోజుల వరకు మాత్రమే ఉంటుంది. మీరు ఎంచుకున్న డీలర్ వద్ద ఎంపిక చేసుకున్న తేదీల్లో ఈ హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లు అమరుస్తారు. అపాయిమెంట్ రోజు ఆర్సీ కాపీని వెంట తీసుకువెళితే నంబర్ ప్లేట్ బిగిస్తారు.

భూమోళ్ల కృష్ణయ్యకు దళితరత్న అవార్డు



దళిత రత్న అవార్డు అందుకుంటున్న కృష్ణయ్య

వికారాబాద్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లాకు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ దళిత నాయకుడు భూమోళ్ల కృష్ణయ్య దళితరత్న అవార్డు అందుకున్నారు. డాక్టర్ అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా అంటరానితనానికి వ్యతిరేకంగా, దళితుల సమస్యలపై పోరాటం చేస్తూ దళితుల అభ్యున్నతికి కృషి చేసే దళిత నాయకులకు ప్రభుత్వం దళితరత్న అవార్డు ప్రదానం చేసింది. బీఆర్ అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లాకు చెందిన భూమోళ్ల కృష్ణయ్యకు మహనీయుల ఉత్సవాల కమిటీ చైర్మన్ ఇటుక రాజు, వర్కింగ్ చైర్మన్ చెరుకు రాంచందర్, కృపాకర్, రాజలింగం, మేడి పాపయ్య మాదిగల చేతుల మీదుగా దళిత రత్న అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. అంబేడ్కర్ స్ఫూర్తితో దళితుల సమస్యలపై పోరాటం చేస్తానన్నారు. కార్మికుల సమస్యలపై 25సంవత్సరాలుగా చేసిన పోరాటాన్ని గుర్తించిన కేసీఆర్ తనకు శ్రమశక్తి అవార్డు ఇచ్చారని తెలిపారు. దళితరత్న అవార్డు ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర్ రాజనర్సింహాలకు ధన్యవాదాలు చెప్పారు.

తాటిపర్తిలో భూ సర్వే వద్దు

యాచారం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి):మండలంలోని తాటిపర్తిలో అటవీ భూములకు ఆనుకొని ఉన్న పట్టా భూముల ఉన్నాయని, అక్కడ సర్వే చేయొద్దని 40మంది రైతులు సర్వే సిబ్బందికి అడ్డుకున్నారు. తమ భూము ల జోలికి రావొద్దని కోరారు. విషయం తెలుసుకున్న హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ ఇన్‌స్పెక్టర్ కృష్ణంరాజు రైతులతో మాట్లాడారు. సర్వే నంబర్ 104లో 250ఎకరాల భూదాన్ భూములున్నాయని, 109లో 80 మంది, 114లో 120 మంది, 118లో 80మంది రైతుల భూములున్నాయన్నారు. తమ భూములు ఫార్మాసిటీ జాబితాలో లేవని రైతులు అన్నారు. ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి రెవెన్యూ ఆఫీసుకు కార్యాలయానికి చేరుకొని రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కొంత అటవీశాఖ, కొంత పట్టా భూములున్నట్లు గుర్తించారు. బుధవారం అటవీభూముల వద్దకు రావాలని ఆర్డీవో కందుకూరు రేంజర్ భావనను ఆదేశించారు.



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

కరన్‌కోట్ ఎస్‌బీఐలో షార్ట్ సర్క్యూట్

- అగ్నికి ఆహుతైన ఫర్నిచర్, కంప్యూటర్లు
- రెండు ఫైరింజన్లతో మంటలార్పిన ఫైర్ సిబ్బంది
- లాకర్‌లోని బంగారం, డబ్బు, డాక్యుమెంట్లు సేఫ్
- రూ.60లక్షల వరకు నష్టం : బ్రాంచ్ మేనేజర్ భువన్‌మోహన్



బ్యాంకులో కాలిపోయిన ఫర్నిచర్, ఇతర వస్తువులు

తాండూరురూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా తాండూరు మండలం కర్‌కోట్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)లో షార్ట్ సర్క్యూట్‌తో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ప్రమాదంలో బ్యాంకు అగ్నికి ఆహుతైంది. ఫర్నిచర్, కంప్యూటర్లు, ఇతర వస్తువులు కాలిబూడిదయ్యాయి. తాండూరు, కొడంగల్ నుంచి రెండు ఫైరింజన్లు వచ్చి మూడు గంటలపాటు శ్రమించి మంటలార్పాయి. సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. కరన్‌కోట్ సీసీఐ టౌన్‌షిప్‌లో ఎస్‌బీఐలో ఉదయం 9.30గంటలకు బ్యాంకు మేనేజర్ భువన్ మోహన్ తాళాలు తీసి బ్యాంకును తెరిచారు. బ్యాంకు లోపల పొగలు కమ్ముకున్నాయి. ఆయన కరన్‌కోట్ పోలీసులకు, తాండూరు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైరింజ్ చేరుకుని మంటలను ఆర్పే ప్రయత్నం చేయగా మంటలు అదుపులోకి రాలేదు. కొడంగల్ ఫైర్ స్టేషన్ నుంచి మరో ఫైరింజన్‌ను రప్పించి మంటలార్పారు. ఫైర్ సిబ్బంది 3గంటలపాటు శ్రమించారు. అయితే కరన్‌కోట్‌కు రోడ్డు సక్రమంగా లేక ఫైరింజన్ రావడం ఆలస్యమైంది. దీంతో మంటలు చెలరేగి సామగ్రి కాలిపోయింది. సమీపంలోనే సీసీఐ కర్మాగారం ఉన్నా అక్కడ ఫైరింజన్ లేదు. ఫైరింజన్ తాండూరు నుంచి రావాల్సిన వచ్చింది. కాగా సీసీఐ వద్ద ఫైరింజన్ ఉంటే ప్రమాద తీవ్రత తగ్గేదని మాజీ ఎంపీపీ శరణబసప్ప, కాంగ్రెస్ నాయకుడు పురుషోత్తంరెడ్డి తదితరులు ఆరోపించారు. తాండూరు, కొడంగల్‌ల ఫైర్‌స్టేషన్ల సిబ్బంది, కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి, ఏఎస్‌ఐ పవన్ పోలీసు సిబ్బంది మంటలను అదుపునకు ప్రయత్నించారు. జిల్లా ఫైర్ అధికారి హుటాహుటిన కరన్‌కోట్ చేరుకుని ఘటనపై బ్యాంకు మేనేజర్‌ను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోనే ఫైర్ ఇంజన్‌ను అందుబాటులో పెట్టాలని గ్రామానికి చెందిన సీసీఐ కాంట్రాక్టర్ కిషన్‌రావు, కొత్త రాజుగౌడ్, అశోక్ తదితరులు కోరారు. బ్రాంచ్ మేనేజర్ భువన్ మోహన్ విలేకరులతో మాట్లా డుతూ.. లాకర్‌లోని బంగారం, డబ్బు, డాక్యుమెంట్లు భద్రంగానే ఉన్నాయన్నారు. పట్టాదారు పాసు పుస్తకాలు, డాక్యుమెంట్లు కాలిపోయాయేమోనని రుణగ్రహీతల ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కొద్ది రోజుల్లోనే సేవలను పునరుద్ధరిస్తా మన్నారు. ఆరు కంప్యూటర్లు, ఫర్నిచర్, ఫ్యాన్లు, సీలింగ్, ఏసీ, బ్యాటరీలు, సీసీ కెమెరాలు కాలిపోయాయని, రూ.60లక్షల వర కునష్టం వాటిల్లిందన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.



మాట్లాడుతున్న బ్యాంక్‌మేనేజర్ భువన్ మోహన్

రికార్డులను సక్రమంగా నిర్వహించాలి



రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి):ఎన్నేపల్లిలోని స్వామి వివేకానంద స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ చైల్డ్‌కేర్ సెంటర్‌ను మంగళవారం అదనపు కలెక్టర్ సుధీర్ తనిఖీ చేశారు. ఆయన రికార్డులను పరిశీలించారు. డార్మెటరీ, వాష్‌రూంలను పరిశీలించారు. పిల్లలకు ఆరోగ్య పరీక్షలు ప్రతినెలా నిర్వహిస్తున్నారా? మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నా? అని నిర్వాహకులను అడిగారు. అన్ని రకాల రికార్డులను సక్రమంగా నిర్వహించాలని వారికి సూచించారు. ఆయన వెంట ఇన్‌చార్జి జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి జయసుధ, ఉన్నారు.

మురుగునీటి 'ఔట్‌లెట్'పై ప్రత్యేక దృష్టి



- కొత్తూర్ మున్సిపల్ కమిషనర్ బాలాజీ

కొత్తూర్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): నూతన మున్సిపాలిటీగా ఏర్పడిన కొత్తూర్‌లో భాగ్యరు మురుగునీటికి సరైన ఔట్‌లెట్లు లేకపోవడంతో తరచూ డ్రైనేజీ కాలువలు స్తంభించిపోతున్నాయి. దాంతో మురుగు రోడ్లపైకి వచ్చి చేరుతోంది. ఔట్‌లెట్లు నుంచి మురుగునీరు పొలాల్లోకి వెళ్తుండడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీకి శాశ్వత ఔట్‌లెట్లు లేకపోవడంతో అధికారులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సందర్భంగా కొత్తూర్ మున్సిపల్ కమిషనర్ బాలాజీ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ఫేస్ టు ఫేస్

ప్రశ్న: మురుగునీటి ఔట్‌లెట్లపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: మున్సిపాలిటీలోని వివిధ కాలనీల్లో నుంచి వస్తున్న మురుగునీటికి ఔట్‌లెట్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శాశ్వత ఔట్‌లెట్ల కోసం ప్రతిపాదనలు చేశాం. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి కూడా తీసుకెళుతున్నాం.

ప్రశ్న: ఏయే కాలనీలకు మురుగునీటి ఔట్‌లెట్లు లేవు?

జవాబు: 44వ జాతీయ రహదారి పక్కన కాలనీ, 6వ వార్డు, పాతిమాపూర్ ప్రాంతంలో ఔట్‌లెట్లు లేకపోవడంతో బహిరంగ ప్రాంతాల్లో మురుగునీరు నిలుస్తోంది.

ప్రశ్న: ఔట్‌లెట్లకు ఎలాంటి ప్రణాళిక తయారు చేస్తున్నారు?

జవాబు: జాతీయ రహదారి పక్కన కాలనీల నుంచి వచ్చే మురుగునీరు స్టేషన్ తిమ్మాపూర్ వద్ద గల మురుగు నీటి కాలువకు మళ్లించేందుకు ప్లాన్ చేశాం. పాతిమాపూర్ నుంచి వచ్చే మురుగునీటిని కమ్మగూడ డ్రైనేజీ కాలువకు మళ్లించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం.

ప్రశ్న: ఏయే కాలనీల్లో మురుగునీటి కాలువలు లేవు?

జవాబు: వింటేజ్ కాలనీ, పెంజర్ల రోడ్డు, 6వ వార్డుల్లో మురుగునీటి కాలువల నిర్మాణాలు జరగలేదు. త్వరలో మురుగునీటి కాలువల నిర్మాణాలు చేపడతాం. సమస్యలు పరిష్కరిస్తాం.

ప్రశ్న: తడి, పొడి చెత్త సేకరణలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: బహిరంగ ప్రాంతాల్లో చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. తడి, పొడి చెత్త వేరు చేసి ఇంటి ముందుకు వచ్చే సిబ్బందికి అందజేయాలి. ఆదేవిధంగా ఎప్పటికప్పుడు చెత్తను ఎత్తి వేయించి దూర ప్రాంతాలకు తరలిస్తున్నాం.

గాలివాన బీభత్సం



చౌదరిగూడ : కొందుర్గు మండలం లక్ష్మీదేవిపల్లిలో ఎగిరిపోయిన పౌల్ట్రీఫాం రేకులు

భారీ ఈదురుగాలి.. చిరుజల్లులు

కందుకూరు : మండలంలోని గఫూర్‌నగర్, కొత్తూరు, ఫలిమామిడి, జైత్వారం, కొత్తగూడ, నేదునూరు గ్రామాల్లో గాలివానకు చెట్లు విరిగిపడ్డాయి. జైత్వారం జిల్లాలోని బొక్క పరశురాం రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో విరిగిపోయిన మామిడి చెట్ల కొమ్మలు విరగడంతో కాయలు నేలరాలాయి. యాచారం: మండలంలోని కుర్మిద్దల్లో పిడుగుపాటుకు రూ.90వేల విలువైన పాడి ఆవు మృతి చెందింది. రైతు పసుల సత్తయ్య సాయంత్రం తన పాడి ఆవును దొడ్డి పక్కన ఉన్న చెట్టుకు కట్టేశాడు. సాయంత్రం ఉరుములు, మెరుపులతో చిరుజల్లులు కురిశాయి. పిడుగుపాటుకు ఆవు మరణించింది. ప్రభుత్వం సాయమందించి ఆదుకోవాలని వేడుకున్నాడు.

ఎగిరిపోయిన ఇంటి పైకప్పు

చౌదరిగూడ : గాలివానకు మండల పరిధిలోని లక్ష్మీదేవునిపల్లి(కొండోనిబావి) గ్రామానికి చెందిన కప్పేర రవికి చెందిన ఇంటి పైకప్పు, అంజయ్య గౌడ్ కు పౌల్ట్రీ షెడ్డు రేకులు ఎగిరిపోయాయి. వర్షం కురిసే సమయంలో రవి ఇంట్లోనే ఉన్నాడు. ఒక్కసారిగా గాలి దుమారం రావడంతో ఇంటిపై కప్పు రేకులు గాల్లోకి ఎగిరిపోయాయి. గోడపై ఉన్న ఇటుకల కింద పడ్డాయి. మామిడికాయలు గాలికి నేలరాలాయి.

పిడుగుపాటుకు ఎద్దు మృతి

చౌదరిగూడ : మండల పరిధిలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. శ్రీరంగాపూర్‌లో రైతు బుయ్యని లాలయ్యకు చెందిన ఎద్దు పిడుగుపాటుకు మృతిచెందింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకుడు సయ్యద్ సాదిక్ పటేల్ స్థలాన్ని పరిశీలించి రైతును పరామర్శించారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు.

83 ఎకరాల్లో పంట నష్టం

తలకొండపల్లి : వడగండ్ల వర్షానికి తలకొండపల్లి మండలం చంద్రదన, బదునాపూర్ గ్రామాల్లో 83 ఎకరాలలో వరి, మొక్కజొన్న, మామిడి పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు గుర్తించారు. మంగళవారం ఆయా గ్రామాల్లో ఆమనగల్లు వ్యవసాయ శాఖ ఏడీఏ శోభారాణి, ఏవో రేణుకుమార్ వర్షి పర్యటించారు. నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. ఏఈవో శ్రీనాథ్, రైతులు నాయినిసర్సింహ, యాదయ్య, అలివేలు, సురేశ్, వెంకటరెడ్డి ఉన్నారు.

200 ఎకరాలలో వరి పంట..

యాచారం : మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం వచ్చిన వడగళ్లవానతో దెబ్బతిన్న పంటలను మంగళవారం మండల వ్యవసాయాధికారి రవినాథ్ పరిశీలించారు. మండలంలో 200 ఎకరాల్లో వరి పంట పాడైందన్నారు. 35 ఎకరాలలో మామిడికాయలతోపాటు కూరగాయల పంటలకు నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. మండలంలోని నానక్‌నగర్, కుర్మిద్ద, మేడిపల్లి, తాటిపర్తి, చౌదర్‌పల్లి, నందివనపర్తి, అయ్యవారిగూడ, నక్కర్తమేడారం, సుల్తాన్‌పూర్, మంతన్‌గౌరెల్లి గ్రామాల్లో ఈదురుగాలులతో పాటు ఓ మోస్తరు వడగళ్లవాన కురిసింది. వడగళ్ల వర్షంతో వరి ధాన్యం నేలరాలడంతో ఏం చేయాలో తోచడం లేదని మంతన్‌గౌరెల్లికి చెందిన రైతులు లాలునాయక్, ఈశ్వర్‌నాయక్, అయ్యవారిగూడకు చెందిన వెంకటేష్, రవి తదితరులు ఆందోళన వ్యక్తం చేశారు. దెబ్బతిన్న పంటల వివరాలను తెలుసుకున్నామని మండల వ్యవసాయాధికారి రవినాథ్ తెలిపారు.



యాచారం : మంతన్‌గౌరెల్లిలో నేలరాలిన వరి ధాన్యం



మహేశ్వరంలోని ప్రధాన రహదారిలో నేలకొరిగిన చెట్టు

క్రైం కార్నర్

చెరువులో వ్యక్తి మృతదేహం లభ్యం



షఫీ(ఫైల్)

కొత్తూర్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కొత్తూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కమ్మగూడ గ్రామ శివారులో గల గోదుమకుంటలో ఓ వ్యక్తి మృతదేహాన్ని మంగళవారం కనుగొన్నట్లు ఎస్సై మురళీగౌడ్ తెలిపారు. గోదుమకుంటలో మృతదేహం తేలియాడుతూ కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా వచ్చి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి జేబులో దొరికిన ఆధారాల ప్రకారం.. షఫీ(33), బీహార్‌లోని వైశాలి జిల్లా, అబాబకర్పూర్ అని గుర్తించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి ఒంటిపై తెల్లని హాఫ్ బనియన్, నల్లని ప్యాంటు ఉన్నట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని షాదనగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రెండు రోజు క్రితం చెరువులో పడి ఉండవచ్చని ఎస్సై అనుమానం వ్యక్తం చేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. ఆచూకీ తెలిసినవారు-98666-83449 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని డెడ్‌బాడీ..

కందుకూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి శవం లభ్యమైన సంఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. కొత్తగూడ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఓమాదేవి ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని బాలాజీ వెంచర్లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. దాంతో పంచాయతీ సిబ్బంది విషయాన్ని కార్యదర్శికి చెప్పారు. 40 నుంచి 45 సంవత్సరాల వయస్సు ఉంటాయని పోలీసులు తెలిపారు. శరీరానికి నూనె అంటి ఉందని, మృతుడు 5.6 అడుగుల ఎత్తు కలిగి, శరీరంపై దుస్తులు లేకుండా విగతజీవిగా పడి ఉన్నాడు. ఒంటిపై ఎలాంటి గాయాలు లేవని పోలీసులు తెలిపారు. కొద్ది రోజులుగా ఈ ప్రాంతంలో బిక్షాటన చేస్తున్నాడని స్థానికులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని శవాన్ని ఉస్మానియాకు తరలించినట్లు ఎస్సై సైదులు తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే 87126-62687 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

పని కల్పిస్తామని నమ్మబలికి నిలువు దోపిడీ

- 2 తులాల బంగారం, 5వేల నగదు అపహరణ
- కూలి పని కోసం వేచి ఉన్న మహిళలే టార్గెట్‌గా గుర్తుతెలియని దుండగుల అఘాయిత్యం

నందిగామ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కూలి పని కోసమని రోడ్డుపై నిలుచున్న ఇద్దరు మహిళలకు పని కల్పిస్తామని నిలువు దోపిడీ చేసిన సంఘటన మండలంలోని రంగాపూర్ శివారులోని ఓ వెంచర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. నందిగామ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ కథనం మేరకు.. కొత్తూరు మున్సిపాలిటీకి చెందిన సత్తెమ్మ, విజయలు రోజూ వారి కూలి కోసం కొత్తూరు అడ్డా వద్ద ఉండగా.. ఓ వ్యక్తి బైక్‌పై వచ్చి పని కల్పిస్తామని నమ్మించాడు. ఈక్రమంలో వారిని రంగాపూర్ శివారులోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లాడు. అయితే, అప్పటికే మరొక వ్యక్తి ముందస్తు ప్రణాళిక ప్రకారం.. ఆ ప్రదేశంలో ఉండడంతో ఇద్దరు మహిళలను భయపెట్టి ఇద్దరూ కలిసి వారి వద్ద తులం చొప్పున బంగారంతో పాటు రూ.5వేలు దోచుకుని పారిపోయారు. తర్వాత బాధితులు నందిగామ పోలీసులకు విషయం చెప్పగా ఘటన స్థలానికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఆలయంలో చోరీ..

బంగారం, వెండి, నగదు అపహరణ

చౌదరిగూడ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని ముష్టిపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు గుడిలోకి అక్రమంగా ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. ఎస్సై విజయ్ కథనం మేరకు.. ముష్టిపల్లి శివారులోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోకి గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం రాత్రి ప్రవేశించి ఆలయంలోని అరతులు బంగారం, పది తులాల వెండి, హుండీలో ఉన్న రూ.20వేలు ఎత్తుకెళ్లినట్లు పూజారి నర్సింహాచారి తెలిపారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తెగిపడిన విద్యుత్ వైరు..

ఇద్దరు చిన్నారులకు గాయాలు

- ఒకరి పరిస్థితి విషమం

షాద్‌నగర్ రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వైర్లు తెగిపడి ఇద్దరు చిన్నారులు గాయాలైన సంఘటన ఫరూఖ్‌నగర్ మండలం ఉప్పరిగడ్డలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చిన్నారుల తండ్రి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన యాదయ్య, అహల్య దంపతుల కుమారులు సుశాంత్(7), సుమంత్(6) సోమవారం సాయంత్రం 6.00 గంటల సమయంలో ఇంటి ముందు ఆడుకుంటుండగా ఈదురు గాలులకు విద్యుత్ వైరు తెగి ఇంటి ముందు ఉన్న చెట్టుపై పడింది. అయితే, ఆది తాడు అనుకుని ముందుగా సుమంత్ వైరును పట్టుకున్నాడు. దాంతో విద్యుత్ షాక్ తగిలి గిలగిలా కొట్టుకుంటున్న క్రమంలో సుశాంత్ అతడిని పట్టుకున్నాడు. ఆ సమయంలో బయటకి వచ్చిన తల్లి కర్ర తీసుకుని వైరును వేరు చేసి పిల్లలను దూరంగా నెట్టివేసింది. వెంటనే వారిని ఆటోలో షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. సుశాంత్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం మంగళవారం ఉస్మానియాకు తరలించారు.

ట్రాక్టర్ బ్యాటరీలు చోరీ

షాద్‌నగర్ రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల గ్రామంలో సోమవారం రాత్రి గుర్తుతెలియని దొంగలు నాలుగు ట్రాక్టర్లకు చెందిన బ్యాటరీలు దొంగిలించారు. గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టర్ బ్యాటరీని దొంగిలించిన దొంగలు.. ఆదే గ్రామానికి చెందిన వాల్మీకి శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్య ట్రాక్టర్ బ్యాటరీలు, వడ్డె శంకర్‌కు చెందిన ఐచర్ బ్యాటరీని ఎత్తుకెళ్లారు. బాలరాజ్‌కు చెందిన టిప్పర్ బ్యాటరీ కూడా దొంగిలించేందుకు యత్నించారు. ఈమేరకు బాధితులందరూ మంగళవారం షాద్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గ్రామానికి చేరుకుని పరిశీలించారు. త్వరలో దొంగలను పట్టుకుంటామన్నారు.

పోగొట్టుకున్న పది సెల్‌ఫోన్లు రికవరీ

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల దొంగిలించబడ్డ పది సెల్‌ఫోన్లను రికవరీచేసి మంగళవారం బాధితులకు అందజేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వేర్వేరు ప్రాంతాల్లో వీటిని గుర్తించి నిందితుల నుంచి రికవరీ చేసినట్లు సీఐ జగదీష్ తెలిపారు.

వనజీవి రామయ్యకు 'హరిత' నివాళి



మొక్కలు నాటుతున్న ఉద్యోగులు

షాద్‌నగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వనజీవి, పద్మశ్రీ దరిపల్లి రామయ్యను ఆదర్శంగా తీసుకుని పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బృహస్పతి టెక్నాలజీస్ లిమిటెడ్ డైరెక్టర్ రాజశేఖరరాజు పిలుపునిచ్చారు. ఇటీవల మరణించిన వనజీవి పద్మశ్రీ దరిపల్లి రామయ్యకు నివాళిగా మంగళవారం ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్లలో తమ సంస్థ ఉద్యోగుల చేత మొక్కలు నాటి ఆయనకు ఘన నివాళులర్పించారు. తమ సంస్థ ద్వారా 100 మంది ఉద్యోగులతో వంద మొక్కలు నాటినట్లు రాజశేఖరరాజు తెలిపారు.



ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు, ట్రాఫిక్ పోలీసులు

ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించొద్దు : సీఐ

చేవెళ్ల, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవని చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం తెలిపారు. మంగళవారం మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీస్‌ల ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని ప్రధాన రోడ్డుపక్కన ఉన్న దుకాణాల ముందు ట్రాఫిక్‌కు ఇబ్బంది కల్గించే బోర్డులను అధికారులు దగ్గరుండి తొలగించారు. సీఐ మాట్లాడుతూ.. పట్టణ కేంద్రంలో వ్యాపారులు దుకాణాల ముందు వాహనాలకు ఇబ్బంది కల్గించేలా బోర్డులు ఏర్పాటు చేయడంతోపాటు చిన్న చిన్న బండ్లు ఏర్పాటు చేయడంతో ఇబ్బంది కలుగుతుందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఇబ్రహీంపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ముద్దం వెంకటేశం

- ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌కుమార్



ముద్దం వెంకటేశం, శ్రీనివాస్‌కుమార్

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ముద్దం వెంకటేశం ఎన్నికయ్యారు. బుధవారం కోర్టులో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా ముగ్గురు పోటీలో ఉండగా.. వెంకటేష్‌కు 41 ఓట్లు రాగా.. వేణుగోపాల్‌రెడ్డికి 29, అరుణ్‌కుమార్‌కు రెండు ఓట్లు పోలైనాయి. ప్రధాన కార్యదర్శిగా ఎ.శ్రీనివాస్‌కుమార్ ఎన్నికయ్యారు. కాగా, ఈ పదవి కోసం ఇద్దరు పోటీపడగా శ్రీనివాస్‌కుమార్‌కు 37, టి.రవికిరణ్‌కు 35 ఓట్లు వచ్చాయి. అలాగే ఉపాధ్యక్షుడిగా వై.బాస్కర్, సంయుక్త కార్యదర్శిగా కనరమోని కృష్ణ, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా ఎస్.జై పాల్ నాయక్, లైబ్రరీ కార్యదర్శిగా ఎస్.పాండు, కోశాధికారిగా సాయికుమార్, కార్యవర్గ సభ్యులుగా రామకృష్ణ, మల్లేష్‌లు ఎన్నికయ్యారు.

డీలర్లు నిబంధనలు పాటించాలి

ఆమనగల్లు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఎరువులు, విత్తన అధీకృత డీలర్లు ప్రభుత్వ నిబంధనల మేరకు నడుచుకోవాలని ఆమనగల్లు సబ్ డివిజన్ వ్యవసాయశాఖ ఏడీఏ శోభారాణి సూచించారు. వర్షాకాలం సీజన్‌కు అవసరమైన ఎరువులు, విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాలని కోరారు. ఆమనగల్లు పట్టణంలోని రైతు వేదికలో మంగళవారం ఆమనగల్లు సబ్‌డివిజన్‌లోని ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి మండలాలకు చెందిన ఎరువులు, విత్తన, వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఏవో శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఏడీఏ హాజరయ్యారు. నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ-పాస్ ద్వారానే ఎరువుల విక్రయం జరపాలని తెలిపారు. ఏవోలు అరుణకుమారి, రేణుక చక్రవర్తి, శ్రీలత, ఏఈవోలు, ఎరువుల, డీలర్లు పాల్గొన్నారు.

వానరానికి అంత్యక్రియలు



రాచెరెడ్‌లో వానరానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

కడ్తాల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మృతి చెందిన వానరానికి గ్రామస్తులు సంప్రదాయ బద్ధంగా అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు. రావిచెడ్‌లో మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామంలో కొంతకాలంగా ఓ వానరం జన సంచారం మధ్య తిరుగుతూ జీవిస్తుంది. ఎవరైనా ఆహారం పెడితే తప్ప ఎవరి నుంచి బలవంతంగా తీసుకునేది కాదు. స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో తలదాచుకునేది. గ్రామస్తులందరూ ఆ వానరాన్ని ఆప్యాయంగా పలకరిస్తూ ఉండేవారు. ఈక్రమంలో వానరం ఆకస్మికంగా ఆలయంలోని ఓ గదిలో వానరం మృతిచెందింది. గుర్తించిన స్థానిక శ్రీ సీతారామాంజనేయ భజన మండలి సభ్యులు, గ్రామస్తులు సంప్రదాయ బద్ధంగా బ్యాండ్ వాయిద్యాలు, ఊరేగింపుగా వానరానికి అంత్యక్రియలు నిర్వహించి ఖననం చేశారు.

ఇళ్ల స్థలాలకు పొజిషన్ చూపించాలి

కందుకూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు గత ప్రభుత్వ హయాంలో మండల కేంద్రంలో ఇళ్ల స్థలాల కోసం సర్టిఫికెట్లు ఇచ్చారని, పొజిషన్ చూపలేదని సీపీఎం మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ అన్నారు. మంగళవారం సర్టిఫికెట్లు పొందిన వారితో తహసీల్దార్ కార్యాలయంలో పొజిషన్ చూపాలంటూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2007లో కందుకూరు రెవెన్యూ పరిధిలోని 283 మంది నిరుపేదలకు సర్టిఫికెట్లు ఇచ్చారని, 2023లో ఆదే రెవెన్యూలోని సర్వేనెంబర్ 107లో 330 మందికి సర్టిఫికెట్లు ఇచ్చారని, నేటికీ పొజిషన్ చూపలేదన్నారు. ఇటీవల ఆర్డీవో కె.జగదీశ్వర్‌రెడ్డి స్పందించి రెండు సర్వే నెంబర్లను సర్వే చేయించారని.. ప్లాట్లను ఏర్పాటు చేయడం లేదని ఆరోపించారు. అధికారులు పొజిషన్ చూపాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ గోపాల్ మాట్లాడుతూ నాలుగు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీఇచ్చారు. అంజయ్య, ఆర్.శేఖర్, రాజు, రాములు, అశోక్, ఇందిరమ్మ, ఆర్.అంజమ్మ, సక్కుబాయి, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో ధర్నా చేస్తున్న సీపీఎం కార్యదర్శి బాల్‌రాజ్, తదితరులు

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి



కొందుర్గు : పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో షబానా

షాద్‌నగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించి వారి ఎదుగుదలకు కృషి చేయాలని సీడీపీవో షబానాబేగం సూచించారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండలం అంగన్‌వాడీ 2 కేంద్రంలో పోషణపక్షోత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయలక్ష్మి, కార్యదర్శి అర్జున్‌కుమార్, మహిళా సంఘం అధ్యక్షురాలు జి.మాధవి, ఆశాకార్యకర్త సరళ ఉన్నారు.

చౌదరిగూడ : గర్భిణులు, చిన్నారులకు పోషకాహారం ఎంతో అవసరమని కొందుర్గు ఎంపీడీవో ఆనూరాధ లక్ష్మి అన్నారు. కొందుర్గు మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో షాద్‌నగర్ సీడీపీవో షబానాబేగం ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాలను నిర్వహించారు. అలాగే జిల్లేడ్ చౌదరిగూడ మండలం చింతకుంట తండాలో ఐసీడీఎస్ సూర్‌వైజర్ గీత ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాలను నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్ జోత్స్న, ఏపీఎం ఇంద్రమాలిని, టీచర్లు వసంత, సోనా, పుష్ప, గర్భిణులు, బాలింతలు, పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ

ఆమనగల్లు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలోని గ్రంథాలయాన్ని మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బీజేవీ రాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. గ్రంథాలయ పాఠకులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పుస్తకాలు అందుబాటులో ఉన్నాయా? ఇంకా ఇతర పుస్తకాలు ఏమైనా కావాలా అని అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయ నిర్వాహణ తీరు పట్ల ఆమె తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రెగ్యులర్ గ్రంథపాలకుడిని నియమించాలని, పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచాలని గ్రంథాలయ పాఠకులు కార్యదర్శిని కోరారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన అవసరం

మహేశ్వరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కలిగి ఉండాలని మహేశ్వరం అగ్నిమాపక కేంద్రం అధికారి నాగార్జున అన్నారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం తుక్కుగూడలో పోస్టర్ల ద్వారా ప్రజలకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న కృపేష్

ఇబ్రహీంపట్నం/మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని ఇబ్రహీంపట్నం మాజీ ఎంపీపీ కృపేష్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చిలుకల బుగ్గరాములు కోరారు. మంగళవారం ఇబ్రహీంపట్నంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మండల ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి నాయకత్వంలో సభకు పెద్దసంఖ్యలో కార్యకర్తలు తరలివెళ్లనున్నారు. ఇబ్రహీంపట్నం మండలం నుంచి రెండు వేలమందిని తరలించేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే ప్రజా సమస్యలు పట్టించుకోకుండా మంత్రి పదవికోసం పైరవీలు చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బస్వాపురం శ్రీశైలం, కోశాధికారి బుర్ర మధుకర్, జంగయ్య, నాగరాజు, మాజీ సర్పంచ్ నర్సింహ, తదితరులు పాల్గొన్నారు. మైలారం ప్యాక్స్ చైర్మన్ వెంకటరెడ్డి, నాయకులు బల్వంత్‌రెడ్డి, శ్రీశైలం, జగన్నాథం, జగదీష్, బీరప్ప, బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు నిట్టు జగదీశ్ తదితరులు పాల్గొన్నారు. రజతోత్సవ సభకు మొయినాబాద్ మండలంలోని గ్రామాల నుంచి అధికసంఖ్యలో తరలివెళ్లాలని బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకుడు, బాకారంజాగీర్ మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఈమేరకు ఎన్కేపల్లిలో పోస్టర్ విడుదల చేశారు.

అట్టహాసంగా ముగిసిన బ్యాడ్మింటన్ టోర్నీ

ఆమనగల్లు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నాలుగు రోజుల పాటు ఆమనగల్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్ టోర్నీ నిర్వహించగా మంగళవారం ముగిసింది. షటిల్ టోర్నమెంట్‌లో 10 టీంలు పాల్గొన్నాయి. మొదటి బహుమతి ఏపీఏ అధ్యక్షుడు కృష్ణయాదవ్, (శ్రీకాంత్ టీం, రెండో బహుమతి ఎంగలి ప్రసాద్, తిరుపతి టీం, మూడో బహుమతి వేణు, జగన్ టీంలు గెలుపొందాయి. ఈ సందర్భంగా గెలుపొందిన వారికి బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణయాదవ్, ప్రధాన కార్యదర్శి కొత్త మల్లేశ్‌లు షీల్డ్‌లు, బహుమతులు ప్రదానం చేశారు.

ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేస్తున్న మోదీ సర్కార్



దుబ్బచర్లలో మహిళతో మాట్లాడుతున్న టీపీసీసీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి

మహేశ్వరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రధాని మోదీ పాలన పదకొండు సంవత్సరాలుగా ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేసేలా కొనసాగుతోందని, సామాజిక న్యాయమే ధ్యేయంగా కాంగ్రెస్ పనిచేస్తుందని, సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అనేక రకాల అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నామని టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం దుబ్బచర్ల, లేమూర్, కల్లెంచెర్వుతండాల్లో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పర్యటించారు. ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ రాజ్యాంగం, అంబేడ్కర్‌పై అమిత్‌షా నోరు పారేసుకున్నారని అన్నారు. బీజేపీ నేతలు చేస్తున్న అంతర్గత దాడి దేశాన్ని ముక్కలు చేస్తున్న బీజేపీ తీరుపై కాంగ్రెస్ ఆధినాయకత్వం దేశవ్యాప్తంగా ఓ ఉద్యమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ నందిగామ నర్సింహ, మార్కెట్ కమిటీ వైస్‌ఛైర్మన్ సిహెచ్. యాదయ్య, ఐఎన్‌టీయూసీ నియోజకవర్గం అధ్యక్షుడు శివ, పార్టీ మాజీ మండలాధ్యక్షుడు ఈశ్వర్, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఆమనగల్లు : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి లో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఎనుగొండ రాంరెడ్డి లయన్స్‌కంటి ఆసుపత్రి, ఆమనగల్లు లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నేటి శిబిరం ఏర్పాటు చేశారు. 72మందికి వైద్యుడు చంద్రశేఖర్ కంటిపరీక్షలు నిర్వహించారు. 40మందిని ఐ.ఎల్ ఆపరేషన్ల నిమిత్తం ఎనుగొండ రాంరెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రికి తరలించారు. లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లి : ప్రతిభావంతులు ఏ రంగంలో ఉన్నా ప్రోత్సహించడానికి సిద్ధంగా ఉన్నామని భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ కోరారు. మార్గాలలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్లను మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో వెంకటేష్ ఆవిష్కరించారు. నాయకులు శ్రీనివాసులు, జంగయ్య, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట : బీజేపీ జిల్లా నాయకుడు కర్రెద్ద నరేందర్ రెడ్డి సంతాపూర్‌లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఆమేష్, అంజయ్య, వెంకటేష్, వేణుగోపాల్‌రెడ్డి, రాజు, భద్రప్ప పాల్గొన్నారు.

కందుకూరు : నేదు(బుధవారం) ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి కందుకూరుకు రానున్నట్లు పార్టీ మండల శాఖ అధ్యక్షుడు జయేందర్‌ముదిరాజ్, ఏఎంసీ మాజీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేయనున్నట్లు తెలిపారు.